సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

10వ తరగతి వార్షిక పరీక్షా ఫీజు ప్రభుత్వం నిర్దేశించిన దాని కన్నా అధికంగా వసూలు చేసే పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీ సత్యసాయి జిల్లాలో పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. నిత్యం కరువు కాటకాలకు నిలయంగా ఉన్న జిల్లాలో ఫీజుల దోపిడీనే కాకుండా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పరీక్ష ఫీజులో కూడా విద్యార్థుల నుండి దోపిడీ చేయడం బాధాకరమన్నారు. పదవ తరగతి పరీక్షకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.125 అయితే జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఒక విద్యార్థితో రూ.800 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల పైన చర్యలు తీసుకోకుండా వాళ్ళు ఇస్తున్న మామూళ్ల మత్తులో మునిగితేలుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాలయానికే పరిమితమవుతున్నారని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభం మొదటిలోనే విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్కూల్, టెక్నో, సి బ్యాచ్ ఐకాన్, కొస్పర్క్ లాంటి కోర్సుల పేరుతో యాజమాన్యాలు లక్షల రూపాయలు దోపిడీ చేశాయన్నారు. ఇప్పుడు పరీక్ష ఫీజులో కూడా ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువ వసూలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే మూడు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని, వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిఇఒ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ కుమార్, హర్ష కుమార్, గురు తదితరులు పాల్గొన్నారు.

ఉప'కుల'పతులెవరో..?

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

జెఎన్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విశ్వవిద్యాలయాల ఉపకులపతులెవరన్నది సర్వత్రా చర్చ నడుస్తోంది. ఇది వరకున్న వారికే ప్రాధాన్యతనిస్తారా లేక కొత్త సామాజిక తరగతులపై వైపు మొగ్గు చూపుతున్నారా అన్నది ఆసక్తికరంగా మారింది. జిల్లా పరిధిలో శ్రీ కృష్ణదేవరాయ, అనంతపురం జెఎన్‌టియు రెండు చోట్ల నూతన వైస్ ఛాన్సలర్ల ఎంపికకు సెర్చ్ కమిటీలు వేశారు. ఇప్పటికే రేసులోనున్న వారు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఎవరిని కమిటీ ఎంపిక చేస్తుందన్నది చర్చ నడుస్తోంది. కమిటీ మూడు పేర్లు ఎంపిక చేస్తే అందులో ఒకరిని గవర్నర్ ఎంపిక చేస్తారు. ఈ మూడు పేర్ల ఎంపికను సెర్చ్ కమిటీ పూర్తి చేస్తుంది. ఇందులో ప్రధానంగా ఏ సామాజిక తరగతికి ప్రాధాన్యత కల్పిస్తుందన్న చర్చ నడుస్తోంది. అనంతపురం జెన్‌టియు వైస్ ఛాన్సలరు రంగజనార్ధన్ పదవీకాలం ఈనెల 24వ తేదీతో ముగియనుంది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరుకు సంబంధించి పదవీకాలం జనవరితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త వారి ఎంపికలో ఏ సామాజిక తరగతికి ప్రాధాన్యత లభిస్తుందన్నది చర్చ నడుస్తోంది. ఇంతక మునుపున్న వైస్ ఛాన్సలరు రంగ జనార్ధన్ బిసి కాగా, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలరు రామకృష్ణారెడ్డి ఓసి. ఈ ఇద్దరు కూడా మరోమారు రేసులోనున్నట్టు సమాచారం. కాగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సంబంధించి పాలనలో అనేక ఆరోపణలొచ్చాయి. విద్యార్థి సంఘాలు వైస్ ఛాన్సలరు నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆందోళనలు సైతం నిర్వహించాయి. అర్హతపైనే అనేక సందేహాలూ ఆయనపై ఉన్నాయి. దీంతో ఆయనకు మరోమారు అవకాశం లభిస్తుందా లేదా అన్న సందేహాలూ నెలకొన్నాయి. ఈయన కాకుండా బిసిలు అక్కడ రేసులోనున్నట్టు తెలుస్తోంది. ఇక అనంతపురం

రేసులో నిలిచేదెవరో...

జెఎన్‌టియుకు సంబంధించి ప్రస్తుత విసి రంగ జానర్ధన్ కూడా రేసులోనున్నారు. ఆయనున్న ఈ కాలంలో వివాదాలకు చోటు లేకుండా సాఫీగా పాలన సాగింది. అందరినీ చాలా వరకు సమన్వయం చేసుకుని వెళ్లారు. దీంతో ఈసారి ఆయనకు ప్రాధాన్యత లభిస్తుందా లేక కొత్త వారివైపు మొగ్గు చూపుతారా అన్నది చూడాల్సుంది. జెఎన్‌టియు పరిధిలో ఇద్దరు బిసిలు, ఒక ఎస్సీ, ఒకరు ఓసి నుంచి బరిలోనున్నట్లు తెలుస్తోంది. అందరూ స్థానికంగానున్న వారుకాగా, ఒకరు బయటి వారు ఉన్నట్టు సమాచారం. ఇందులో ఏ సామాజిక తరగతికి ప్రాధాన్యత కల్పిస్తారా అన్నది చర్చ నడుస్తోంది. రేసులోనున్న వారు వారివారి మార్గాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన అధికారులే ఉన్నత స్థాయిలో కూడా ఉండటంతో వారి ద్వారా ప్రయత్నాలు మరింత ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మరికొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఈసారి సామాజిక మార్పు జరుగుతుందా లేక పాత సామాజిక తరగతికే ప్రాధాన్యత కల్పిస్తారా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. రొటేషన్‌లో మార్పులు చేస్తే ఇప్పుడు పాత వారికి నిరాశే ఎదురయ్యే అవకాశముంది. ఇదే సమయంలో విద్యాబోధన సిబ్బంది నియామకాలు నడుస్తున్నాయి. ఈ రెండింటి నడుమ విశ్వవిద్యాలయాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఒకవైపు విద్యాబోధన నియామకాలు, మరోవైపు వైస్ ఛాన్సలరు నియామకాలతో విశ్వవిద్యాలయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వైసిపి కార్యాలయంలో వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరాం రెడ్డి, జబీవుల్లా, టౌన్ కన్వీనర్లు సీఎం సాదిక్, బెల్లం నరేష్, మండల కన్వీనర్లు రాము, నారాయణస్వామి, ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణప్ప, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులతో కరాటే మాస్టర్ ఫైరోజ్

మన్యంలో మెరిసిన 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి రాష్ట్ర స్థాయి 67వ కరాటే టోర్నమెంట్ ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మన్యం జిల్లా పార్వతీపురంలో జాతీయ ఉమ్మడి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ సత్య సాయి జిల్లా నుంచి హిందూపురం పట్టణంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే మాస్టర్ ఫైరోజ్ వద్ద శిక్షణ తీసుకుని పోటీలకు హాజరైన వారు ప్రతిభ కనపర్చారు. అండర్ 14, 17, 19 విభాగానికి సంబంధించిన వారు ప్రతిభ కనబర్చినారు. ఇందులో పాంచజన్య బ్రిలియంట్ హై స్కూల్ స్కూల్ 9వ తరగతికి చెందిన టి. నేహా అండర్ 17లో 60 కేజీల ఫైట్ కేటగిరిలో తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. బాల యేసు కళాశాలకు చెందిన ఎస్. రియాజ్ అండర్-17లో 45కేజీల ఫైట్‌లో ద్వితీయ స్థానం సాధించారు. ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎస్. సయ్యద్ జాతీయ స్థాయి కరాటే పోటీలలో అండర్ -17లో 50 కేజీల పోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. పాంచజన్య బ్రిలియంట్ హై స్కూల్ స్కూల్ 7వ తరగతి ఎన్. ధనుంజయ అండర్ 14లో 60కేజీల ఫైట్ కేటగిరిలో తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఎల్ఆర్‌జి నాయుడు జూనియర్ కళాశాల ఇంటర్ సెకండియర్ విద్యార్థి పి గ్రీష్మ అండర్ -17లో 48కేజీల ఫైట్‌లో తృతీయ స్థానం, మనస్వి పాఠశాల 8వ తరగతి లికిత అండర్ -14లో 30కేజీల పోటీల్లో తృతీయ స్థానం, నారాయణ కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి హరీష్ అండర్-19లో 58 కేజీల్లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఇదే కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి లోకేష్ అండర్ 17లో మైనస్ 54 కేజీల పోటీలలో రెండో స్థానం సాధించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులను కరాటే మాస్టర్ ఫైరోజ్ ఈసందర్భంగా అభినందించారు.

సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 15న చేపడుతున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శంకర్ నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజి ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, చౌళూరు మధుమతిరెడ్డి కోరారు. సామాజిక సాధికారత బస్సుయాత్ర విజయవంతంపై పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని బస్సుయాత్రను విజయవంత చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, పట్టణ కన్వీనర్లు సిఎం సాధిక్, నరేష్, మండల కన్వీనర్లు రాము, నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, జెసిఎస్ కన్వీనర్ మారుతిరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక : వైసిపి వాణిజ్య విభాగ జనరల్ సెక్రెటరీ షాజహాన్, రఫీక్ ఆధ్వర్యంలో హిందూపూర్ మున్సిపాలిటీ పరిధిలోనిముక్కడి పేటకు చెందిన సాధిక్, ఆరిఫ్, బాబా, రఫీక్, సల్మాన్‌తో పాటు దాదాపు 70 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వీరందరికి నాయకులు పార్టీ కండువా వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. అనంతరం బహిరంగ సభ జరిగే అంబేద్కర్ సర్కిల్‌ను నాయకులు పరిశీలించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాధవ్

అక్కడ సర్పంచి.. ఇక్కడ మెకానిక్..!

జీవనోపాధి కోసం మెకానిక్‌గా మారిన గ్రామ పంచాయతీ ప్రథమ పౌరుడు

ఆనాటి కాలంలో సర్పంచి అంటే గ్రామపెద్దగానూ, ఊరికి దిక్కుగాను భావించేవారు. అయితే నేటి కాలంలో సర్పంచుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఎంతో వ్యవప్రయాసలకు ఓర్చి సర్పంచి ఎన్నికల్లో గెలుపొందిన వీరిని గ్రామంలో పట్టించుకునే వారే కరువయ్యారు. ఆర్థికంగా చితికిపోయి జీవనోపాధి కోసం ఉన్న ఊరిని వదిలి మరో మండలానికి కుటుంబంతో సహా వలస వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుని జీవించే పరిస్థితి వాటిల్లింది. అందుకు ఉదాహరణ మడకశిర మండలం మెలవాయి గ్రామ పంచాయతీ సర్పంచి రంగనాథ్ ఉదంతం.

ప్రజాశక్తి- పరిగి

మడకశిర మండలంలో మెలవాయి పంచాయతీకి చెందిన దళిత రంగనాథ్ మెకానిక్. తన కుటుంబపోషణ నిమిత్తం కర్నాటక ప్రాంతంలో మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో ఆయనకు తన స్వంత పంచాయతీ అయిన మెలవాయిలో మంచి సంబంధాలు ఉండేవి. 2021 స్థానికసంస్థల ఎన్నికల్లో మెలవాయి పంచాయతీ స్థానం ఎస్సీకి రిజర్వు అయింది. దీంతో రంగనాథ్ తనతోటి మిత్రులు, బంధువుల సూచనలతో గ్రామ సర్పంచిగా వైసిపి మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేశాడు. ఉత్సాహవంతుడు, చురుకైన వాడైన రంగనాథ్ సర్పంచిగా విజయం సాధిస్తే పంచాయతీకి తనవంతు సేవ చేస్తారని పంచాయతీ ఓటర్లు భావించారు. దీంతో ఆయనను సర్పంచిగా ఎన్నుకున్నారు. తనమీద ఎంతో నమ్మకం పెట్టుకున్న పంచాయతీ ప్రజలకు నిస్వార్ధంగా సేవ చేయాలని రంగనాథ్ భావించాడు. ఇక్కడే కథ అడ్డం తిరిగింది. గ్రామ పంచాయతీ అభివృద్ధికి తగినన్ని నిధులు విడుదల కాలేదు. గ్రామ పంచాయతీలో ఎదైనా పనిచేయాలంటే నిధులు సమస్య నెలకొంది. సర్పంచి ఎన్నికల సమయంలో తనవద్ద ఉన్న సొమ్ముతో పాటు వేలాది రూపాయలు ఖర్చు చేసిన రంగనాథ్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పంచాయతీ అభివృద్ధికి సేవచేయడం అటుంచి తన కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రంగనాథ్ తన అక్కవారి గ్రామమైన పరిగికి కుటుంబంతో సహా వలస వచ్చాడు. ఇక్కడే ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈసందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ కర్నాటకలో ట్రాక్టర్ వాహన మెకానిక్ గా పనిచేస్తూ 2021 పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ మద్దతుగా సర్పంచిగా పోటీ చేసి 836 ఓట్ల మెజార్టీతో గెలుపొందానన్నారు. అయితే గత మూడేళ్లుగా గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రజా సమస్యలు సైతం పరిష్కారం కాలేదన్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రూ. 20 లక్షలు గ్రామ పంచాయతీకి కేటాయించిందన్నారు. అయితే పనుల నిర్వహణకు గుత్తేదారులు ముందుకు రాలేదన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడుతున్నానని ఎమ్మెల్యే కూడా తమను గుర్తిస్తున్నాడని అన్నారు. పంచాయతీ అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నిధులు ఎప్పటికప్పుడు వస్తే సమస్యలు తీరుతాయని అభిప్రాయపడ్డారు. జగన్మోహన్ రెడ్డి గుర్తించి పంచాయతీ నిధులను ఆయా గ్రామాలకు కేటాయించే విధంగా చొరవ చూపాలని అన్నారు. కర్నాటక ప్రాంతంలో జీవనోపాధి పొందుతున్న తాను ప్రజా సేవ చేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేసి గెలిచినప్పటికీ ప్రజాసేవ చేయాలన్న కోరిక తీరలేదని వాపోయారు. ఎన్నికల్లో వేల రూపాయల ఖర్చు చేసి గెలుపొందిన రంగనాథ్‌కు ప్రజా సేవ చేయడం మాట అటుంచి ఆయన భవిష్యత్తుకే హామీ లేకపోవడం బాధాకరమనిఏ సర్పంచికి ఇలాంటి పరిస్థితి రాకూడదని పరిగివాసులు వ్యాఖ్యానిస్తున్నారు.

ట్రాక్టర్ రిపేరీ చేస్తున్న సర్పంచి రంగనాథ్

మెకానిక్ షెడ్డు వద్ద మెలవాయి సర్పంచి రంగనాథ్

దీపావళి సంబరాల్లో అపశృతి

టపాసుల నిప్పురవ్వలు పడి భారీ అగ్నిప్రమాదం
రూ. 20 లక్షలకు పైగా ఆస్తినష్టం

ప్రజాశక్తి, కదిరి టౌన్

కదిరి పట్టణంలో దీపావళి సంబరాల్లో అపశృతి చోటు చేసుకుంది. పట్టణంలోని అయప్పస్వామి ఆలయ సమీపంలో ఎస్ఎల్‌వి ఫర్నీచర్‌కు సంబందించిన గుత్తి రాజశేఖర్ ఇంటిపై ఉంచిన ఫర్నీచర్ సామగ్రిపై టపాసుల నిప్పు రవ్వలు పడటంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రూ. 20 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు రాజశేఖర్‌వాపోయారు. కదిరి పట్టణం తుమ్మల రోడ్ అయ్యప్ప దేవాలయం సమీపాన నివాసముండే గుత్తి రాజశేఖర్ పట్టణంలో ఎస్ ఎల్ వి ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్నారు. తన నివాసంపై రేకులతో షెడ్డులో దుకాణానికి సంబంధించిన మెటీరియల్ బెడ్ షీట్ దిండ్లు ఇతర సామాగ్రి ఉంచాడు. దీపావళి పండుగ సందర్భంగా డగ పురస్కరించుకొని చుట్టుపక్కల వారు టపాసులు కాల్చుతున్న సందర్భంలో నిప్పురవ్వలు రాజశేఖర ఇంటిపై నిల్వ ఉంచిన ఫర్నీచర్ సామగ్రిపై పడటంతో మంటలు వ్యాపించాయి. రాత్రి 7 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో మంటలు భారీ స్థాయిలో వ్యాపించాయి. అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చినా వారు రాత్రి 10 గంటల దాకా వాహనం సంఘటనాస్థలానికి చేరుకోలేదు. కదిరి పట్టణంలో ఉన్న అగ్నిమాపక వాహనం పాలసముద్రం వద్ద జరిగిన ప్రమాదం వద్దకు వెళ్లడంతో పుట్టపర్తి నుంచి వాహనం రావటానికి రాత్రి 10 గంటలు అయింది. దీంతో ప్రయివేటు ట్యాంకరు ద్వారా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. చివరకు 10 గంటల సమయంలో అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు ఆర్పింది. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నారాయణరెడ్డి సిబ్బందితో ఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ సునీత ఘటనాస్థలాన్ని సందర్శించి నష్టతీవ్రతను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఇంటిపై ఉన్న షెడ్డులో ఎగిసి పడుతున్న మంటలు

ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

నవంబర్ 18న సాయంత్రం 4 గంటలకు విజయవాడలో జరిగే జగనన్న ప్రగతిపథం ర్యాలీని జయప్రదం చేయాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి కోరారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ర్యాలీకి సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ఐటి వింగ్ రాష్ట్ర డైరెక్టర్ మారుతీ, షబ్బీర్, వినోద్ రెడ్డి, అరుణ్, మనోజ్, అనిల్, అశోక్, హరి తదితరులు పాల్గొన్నారు.

టూ టౌన్ సిఐగా రియాజ్ అహ్మద్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం టూ టౌన్ స్టేషన్ సిఐగా రియాజ్ అహ్మద్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ సిఐగా విధులు నిర్వహిస్తున్న వలీబాషాను 15 రోజులు పూర్తికాక ముందే విఆర్‌కు పంపారు. సిఐగా భాధ్యతలను స్వీకరించిన రియాజ్ అహమ్మద్ మాట్లాడుతు పట్టణ శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా తన బాధ్యతను నెరవేరుస్తానన్నారు. మట్కా, పేకాట, సంఘ విద్రోహ చర్యల పైన కఠిన చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెలుగుతమ్ముళ్లు

'బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

ముదిగుబ్బ : టిడిపి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని 66వ వార్డ్‌లో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మనోహర్, మండల మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, రియాజ్‌బాషా, ప్రతాప్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కదిరి టౌన్ : కదిరి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎ.కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి వారోత్సవాల ను ప్రారంభిస్తామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించు కోవడం, 16న గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, 17న పర్యావరణ కాలుష్యంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి 20వ తేదీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

కొత్తచెరువు : స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కె.జయరాం తెలిపారు. వారోత్సవాల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేడు ఎం.రాయాపురంలో కాంగ్రెస్ 'ముందడుగు'

మడకశిర : రొళ్ల మండలం ఎం.రాయపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం(నేడు) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముందడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ఎస్.గౌడప్ప తెలిపారు. మాజీ మంత్రి, సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పలువురికి 'పల్లె' పరామర్శ

పుట్టపర్తి రూరల్ : మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా ఇరగరాజుపల్లికి వెళ్లి టిడిపి మాజీ సర్పంచి నర్సిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటగారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామలింగప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. పల్లె వెంట టిడిపి మండల కన్వీనర్ విజయ్‌కుమార్, లింగప్ప, నాగిరెడ్డి, రామాంజనేయులు, కొట్లపల్లి రామయ్య ఉన్నారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె

విజయవాడ వస్త్ర వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం చేనేత వ్యాపారుల వద్ద చీరలు తీసుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన కేసుల్లో విజయవాడకు చెందిన ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్‌గుప్తాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యంతో కలిసి విలేకరుల సమావేశంలో అరెస్టు వివరాలు వెల్లడించారు. అవినాష్‌గుప్తా ధర్మవరం వ్యాపారుల నుంచి పట్టుచీరలు తీసుకుని డబ్బులు ఇవ్వకపోగా 3 నెలల క్రితం విజయవాడలో వ్యాపారులపై దాడులు చేసి ఆ వీడియోలను పట్టణంలోని పలు వ్యాపారులకు పంపారన్నారు. కొందరు స్థానిక వ్యాపారులు అవినాష్‌గుప్తా డబ్బులు ఇవ్వలేదని ఫిర్యాదులు చేయగా 5 కేసులు నమోదయ్యాయన్నారు. దీంతో శనివారం విజయవాడలో అవినాష్‌గుప్తాను సిఐ సుబ్రమణ్యం నేతృత్వంలో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఇదిలా ఉండగా ఓ బెదిరింపు కేసులో అవుకు పోలీసులు సిమ్ కార్డు ఆధారంగా గుర్తించి ధర్మవరం వచ్చి రాజశేఖర్‌రెడ్డిని విచారించారు. అందులో భాగంగా కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి దగ్గరికి వెళ్లి ఇద్దరినీ తీసుకుని వన్టటౌన్ స్టేషన్ వద్దకు వచ్చారన్నారు. అయితే అవుకు పోలీసులు మఫ్టీలో ఉండగా ఎవరో తీసుకెళ్తున్నారని సుధాకర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారే తప్పా ఎవరిపై దాడి చేయలేదన్నారు. అవుకు ఎస్ఐతో మాట్లాడానని, బెదిరింపు కేసులో త్వరలోనే నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం

రేపు జిల్లా స్థాయి బిసిల ఆత్మీయ సమావేశం : బికె

పెనుకొండ : పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న శ్రీనివాస కళ్యాణ మండపంలో ఈ నెల 15వ తేదీ జిల్లా స్థాయి బిసిల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న టిడిపి, బిజెపి, జనసేన, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, రాయలసీమ పరిరక్షణ సమితి, కుల సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మడకశిర : ఈ నెల 15వ తేదీ పుట్టపర్తిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి బిసిల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీతో పాటు నియోజక వర్గంలోని 5 మండలాల నుంచి బిసి నాయకులు హాజరవ్వాలని కోరారు.

పుట్టపర్తి క్రైమ్ : ఈ నెల 15వ తేదీ పుట్టపర్తిలో బిసిల అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల బిసి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని భవిష్యత్తు ప్రణాళికలను నిర్ణయిస్తారన్నారు.

'అనంత'లో 19న గుడికట్ల సంబరాలు

ధర్మవరం టౌన్ : అనంతపురం నగరంలో ఈ నెల 19వ తేదీ నిర్వహించే గుడికట్లు సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కురుబ కల్యాణ మండపం వద్ద గుడికట్ల సంబరాలకు సంబంధిచిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కురుబలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పిడుగు క్రిష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటి వెంకటేశ్, బండి ఉజ్జినప్ప, గవ్వల నారాయణస్వామి, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు కపాడం ఈశ్వరయ్య, నియోజకవర్గ కార్యదర్శి మధు, గవ్వల బాబు, శ్రీనివాసులు, దేవర సూర్య నారాయణ, నారాయణ స్వామి, బండి వెంకటేశ్, హరి, గోవిందు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ఈ నెల 19వ తేదీ అనంతపురం నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గుడికట్ల సంబరాలకు కురుబ కుల బాంధవులు కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, గౌరవాధ్యక్షులు కురుబ శివానంద, జనరల్ సెక్రటరీ బన్యాల రమేష్, ప్రచార కార్యదర్శి కేసాని ఆదినారాయణ, ఉపాధ్యక్షులు కురుబ పవన్, పెప్సీ ప్రభాకర్, కమ్మన్న, నారాయణస్వామి, కోటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాగరాజు, గుమ్మయగారిపల్లి రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కనకదాసు సర్కిల్‌లో మండల కురుబ సంఘం ఆధ్వర్యంలోల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, మల్లికార్జున, జయచంద్ర, సూరి, నవీన్, శ్రీనివాసులు, రామకృష్ణ, జెసిబి మారుతి, కె.శివ, కె.మణికంఠ, కె.నారాయణ స్వామి, బి.వెంకట రాముడు, ఆంజనేయులు, కె.చిరంజీవి, శేషు, కె.తిప్పన్న, కె.గోవింద్, కె.విశ్వనాథ్, ఎస్.నారాయణస్వామి పాల్గొన్నారు.

గుడికట్ల సంబరాల పోస్టర్లను విడుదల చేస్తున్న సామకోటి

ముదిగుబ్బ : కురుబల సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతను సమాజానికి తెలియజేయడానికి అనంతపురంలో ఈ నెల 19న నిర్వహించనున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ తెలిపారు. అనంతరం మండల, గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నారాయణస్వామి, మల్లికార్జున, శ్రీరాములు, సత్తి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో గుజరాతీయుల నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం ప్రశాంతి నిలయంలోని సాయి కులవంత్ హాలులో వారి సంప్రదాయ పద్ధతిలో వారి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి సేవా విద్యార్థులు నిర్వహించిన నాటికలు అలరించాయి. వారు మాట్లాడుతూ ఏటా సత్యసాయి సన్నిధిలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తామని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ప్రశాంతి నిలయంకు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం సంగీత కచేరి, నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పేదల ప్రజలకు అండగా సిపిఎం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో సోమవారం సిపిఎం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐకి చెందిన 30 కుటుంబాలు సిపిఎం అనుబంధ ప్రజాసంఘంలోకి చేరారు. వారు మాట్లాడుతూ సిపిఎం విధానాలు నచ్చి ఇందులో చేరినట్లు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి వాయిద్యాల నడుమ ర్యాలీగా స్థానిక డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి తిరిగి సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొన్నారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఎవరికి కష్టమొచ్చినా ముందుండి పోరాడే పార్టీ సిపిఎం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల నాయకులు శివకుమార్, మునాఫ్, వెంకటేష్, బాబు, పోతులయ్య, లక్ష్మినారాయణ, కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

రాష్ట్ర నిర్మాణ సదస్సు కరపత్రాలు విడుదను విడుదల చేస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తలుపుల

భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో డిసెంబర్ 5వ తేదీ నిర్వహించనున్న రాష్ట్ర నిర్మాణ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సాంబశివ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 1214 మెమో రద్దు, నిర్మాణ రంగం కార్మికులకు సంక్షేమ పథకాలు, ఇళ్లు నిర్మించుకునేందుకు షరతులు లేని రుణాలు, ఇసుక, స్టీల్, సిమెంట్ ధరలు తగ్గింపు, వలస కార్మికులకు ప్రత్యేక కూలి రేట్లు, వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ, తదితర డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టనున్న సదస్సుకు మండలంలోని భవన నిర్మాణ రంగం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల సాధనకు తరలిరండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

శ్మశానవాటిక కోసం స్థలం సాధించుకునేందుకు ప్రజలు తరలి రావాలని సిపిఐ, ఎపి రైతు సంఘం ఆధ్వ ర్యంలో సోమవారం బత్తలపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ బత్తలపల్లిలో మృతి చెందిన వారిని ఖననం చేయడానికి అడుగు స్థలం కూడా లేదని, శవాన్ని పూడ్చిన గుంతల్లోనే చనిపోయిన వారిని పూడ్చే పరిస్థితి నెలకొందన్నారు. మంగళవారం(నేడు) స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండాల ఓబులేసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణయ్య, ఎఐటియుసి నాయకులు వెంకటేష్, నారాయణ, గుమ్మలగుంట పెద్దన్న, మహిళా సంఘం నాయకురాలు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దీపావళి పండుగ సందర్భంగా స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ఆస్థానం పూజ, ప్రాకారోత్సవ కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వస్త్రాలు, పాదుకులు, దండకంలతో ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించి అనంతరం స్వామివారికి సమర్పించారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ ఛైర్మన్ సుబ్రమణ్యం, డైరెక్టర్ పొరాళ్ల పద్మావతి, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

పుట్టపర్తి క్రైమ్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని చిత్రావతి ఘాట్ సమీపంలో చోటు చేసుకుంది. బీహార్‌కు చెందిన అరబింద్‌పాల్(29) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బుక్కపట్నం వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో తిరిగి పుట్టపర్తికి బయల్దేరాడు. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన అనిల్ చిత్రావతి ఘాట్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆపి బండి మీదే కూర్చుని వేరే వ్యక్తితో మాట్లాడుతుండగా అరబింద్‌పాల్ వేగంగా వచ్చి నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయం కావడంతో సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందాడు. అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ ఇతర రాష్ట్రాల నుంచి బతుకుతెరువు కోసం కొన్నేళ్ల క్రితమే పుట్టపర్తికి వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అరబిందోపాల్ (ఫైల్‌ఫొటో)

భార్య పుట్టింటికెళ్లిందని ఆత్మహత్య

బత్తలపల్లి : భార్య పుట్టింటికెళ్లిందని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బత్తలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక పాతూరుకు చెందిన నరసింహులు కుమారుడు చిన్న అక్కులప్ప(27)కు, అనంతపురం రూరల్ మండల పరిధిలోని తాటిచెర్లకు చెందిన సునీతతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. అక్కులప్ప నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. దీంతో ఆమె పలుమార్లు అలిగి పుట్టింటికి వెళ్లినా మళ్లీ తిరిగి వచ్చేది. మూడు రోజుల క్రితం మరోమారు అక్కులప్ప మద్యం మత్తులో ఆమెను కొట్టడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటికి రావాలని కోరినా ఆమె నిరాకరించడంతో ఇంట్లో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. గుర్తించిన కాలనీవాసులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నాటక పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

మడకశిర : కర్నాటక ప్రాంతానికి చెందిన వ్యక్తులకు గంజాయి చేరవేస్తున్న రొళ్ల మండల పరిధిలోని గుంతకల్లు గొల్లహట్టి గ్రామానికి చెందిన కరియన్న, గుడిబండ మండలం చోళగిరి గ్రామానికి చెందిన ఎంజారప్పలను సోమవారం కర్నాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక సరిహద్దులోని రొళ్ల, గుడిబండ ప్రాంతంలో యథేచ్ఛగా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలోనే కర్నాటకలోని తుమకూరు జిల్లా పట్టనాయకహళ్లి పట్టణ ఎస్ఐ భవిత, జమేదార్ గంగప్ప, పోలీసులు గంజాయితో సంబంధం ఉన్న వేలపైనహళ్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి విచారించారు. అతడిచ్చిన సమాచారంతో తొలుత వారు కరియన్నను అదుపులోకి తీసుకుని విచారించి ఎంజారప్ప గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుసుకుని అదుపులోకి తీసుకొన్నారు.

చికిత్స పొందుతూ వైసిపి కార్యకర్త మృతి

గాండ్లపెంట : మండల పరిధిలోని తుమ్మలపెద్దతండా పంచాయతీకి చెందిన వైసిపి కార్యకర్త, గృహసారథిగా పని చేస్తున్న ఇంద్రవత్ భాస్కర్ నాయక్(35) సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్న భాస్కర్ ఇటీవల రక్తపోటు పెరిగి కింద పడడంతో తల వెనుక తీవ్ర గాయమైంది. కర్నూలు ప్రభుత్వాసు పత్రికి తీసుకెళ్లగా రెండు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. భాస్కర్ కుటుంబ సభ్యులను సర్పంచుల సంఘం అధ్యక్షుడు బి.రవీంద్రనాయక్, ఎంపిపి టి.జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రా రెడ్డి, భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. అతని కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందజేసి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

కేబుల్ వైరు, పైపులు అగ్నికి ఆహుతి

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలోని కేశాపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల కేబుల్ వైరు, స్ప్రింక్లర్ పైపులు అగ్నికి ఆహుతయ్యా యి. గుర్తుతెలియని వ్యక్తులు ఎండుగడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు సమీపంలోని పొలాలకు తాకాయి. దీంతో గ్రామానికి చెందిన రైతు వై.చంద్రమ్మ పొలంలో స్ప్రింక్లర్లు, పైపులు కాలిపోయాయి. ఆ పొలం పక్కనే రైతు నరేష్ బోరుకు అమర్చిన విద్యుత్ కేబుల్ వైరు పూర్తిగా కాలిపోయింది. ఆకతాయిలు చేసిన పనికి తాము నష్టపోయామని బాధిత రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబంలో విషాదం

మడకశిర : సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి కుటుంబంలో సోమవారం తీవ్ర విషాదం నెలకొంది. రఘువీరా అన్న, మండల పరిధిలోని గంగులవాయిపాళ్యం గ్రామానికి చెందిన అనిల్‌బాబు తండ్రి శ్రీరామప్ప మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే రఘువీరా హుటాహుటిన ఆ గ్రామం చేరుకుని శ్రీరామప్ప మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రఘువీరా మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో శ్రీరామప్ప చేదోడు వాదోడుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడా రు. ఆయన మృతి బాధాకరమని, ఆయన లోటు తీర్చలేనిదని తెలిపారు.

శ్రీ రామప్ప(ఫైల్‌ఫొటో)

అసాంఘిక శక్తులకు 'గుండుమల' అండ : వైసిపి

ప్రజాశక్తి-అమరాపురం

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నియోజక వర్గంలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నా రని స్థానిక వైసిపి నాయ కులు ఆరోపించారు. స్థానిక ఎడిసిసి బ్యాంక్ ఆవరణలో సోమవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతోమంది టిడిపి నాయకులు గంజాయి, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వారికి తిప్పే స్వామి అండ ఉందని తీవ్రస్థాయిలో విమర్శించారు. అగళి మండలం పూలపల్లి రంగారెడ్డి గతంలో గంజాయి సాగు కేసులో నిందితుడని, కర్నాటకలో గంజాయి కేసులో అరెస్ట్ అయిన గుడిబండ మండలం సిసి గిరి గ్రామానికి చెందిన ఎంజేరప్ప ఇద్దరూ టిడిపికి చెందిన వ్యక్తులే అన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, గుడిబండ మండలం సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్ర, డీలర్ల సంఘం అధ్యక్షుడు శివకుమార్, పులికుంట మంజునాథ్, నారాయణ, సిద్ధప్ప, తిప్పేస్వామి, మూర్తి, ఉదుగురు స్వామి, జెకె.నరసింహమూర్తి, బరుగురప్ప పాల్గొన్నారు.

ఓర్వలేకనే 'గుండుమల'పై ఆరోపణలు

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి నరేష్ కన్నా తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి నిరంతరాయంగా ప్రజాసేవకే అంకితమైన మా నాయకుడి ముందు నిలవలేక వైసిపి ఎమ్మెల్యే తిప్పేస్వామి తన అనుచరులతో నోటికి వచ్చినట్లు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. వైసిపి ఎంపిపిలు, సర్పంచులు, జడ్పిటిసిలు, వాలంటీర్లు, నాయకులు ఎమ్మెల్యే పై చేసిన అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ ఇసుళ్లపై ఉన్న శ్రద్ధ అభివద్ధిపై లేదని మండిపడ్డారు. ఇకనైనా మీరు, ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామికి క్షమాపణ చెప్పాలని లేనిచో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

ముదిగుబ్బ : పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారు లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐ వంశీకృష్ణ, పోలీసులు ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ధర్మవరం టౌన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా ధర్మవరం నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటేశులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు 26వ తేదీ ఉదయం 5 గంటలకు బయల్దేరుతుం దని, రాను, పోనూ టికెట్ ధర రూ. 1600గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7382860947, 7382860418 నెంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ నెల 10, 11 తేదీల్లో అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జూడో సబ్ జూనియర్ జిల్లా పోటీల్లో ధర్మవరం జూడో క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కోచ్ ఇనాయత బాషా తెలిపారు. జూడో అండర్-14 (44 కిలోల) విభాగంలో ఉషారాణి బంగారు, సాయి ప్రియ, సంధ్య కాంస్య పతకాలు సాధించారన్నారు. వీరు ఈ నెల 26వ తేదీ కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని అనంతపురం టూ టౌన్ ఎస్ఐ రిషీంద్రబాబు, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ సిఇఒ బాబు అభినందించారు.

జూడో విద్యార్థులతో ఎస్ఐ రిషీంద్రబాబు, కోచ్ ఇనాయత్ బాషా

క్రీడాకారులకు బూట్లు, టీ షర్టులు వితరణ

రొద్దం : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన మండల పరిధిలోని నారనాగేపల్లి హైస్కూల్ విద్యార్థులకు సోమవారం రొద్దం గ్రామానికి చెందిన ఈడిగ నాగభూషణ్‌గౌడ్ స్పోర్ట్స్ బూట్లు, టీ షర్టులు అందజేశారు. ఈ నెల 8వ తేదీ అనంతపురం నగరంలోని ఆర్‌డిటి క్రీడా మైదానం లో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో విద్యార్థులు సుకన్య, సాయిరామాచారి, చందన, అక్షయ, ద్రాక్షాయని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిని ఎస్ఐ వలిబాషా, హెచ్ఎం రంగప్ప, పిఇటి మహేష్ అభినందించారు. ఎస్ఐ మాట్లాడుతూ వీరు రాష్ట్ర స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించా లని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు బూట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ వలిబాషా

67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో సత్తా

కదిరి టౌన్ : విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ షటిల్ పోటీల్లో కదిరి క్రీడాకారులు సత్తా చాటారు. పట్టణంలోని అడపాలవీధికి చెందిన మురారి వెంకట్ బంగారు పతకం సాధించి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే కాటం ఈశ్వర్‌సాయి ప్రతిభ కనబరిచాడు. కోచ్ ఎ.నాగభూషణ, సిఆర్‌సి క్లబ్ సహకారంతో వారు పోటీల్లో రాణించారు.

15న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

బత్తలపల్లి : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 15వ తేదీన జిల్లా స్థాయి జూనియర్ బాలి కల హ్యాండ్ బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1-1-2004 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలన్నారు. ఎంపికైన వారు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9705883339 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా ప్రజలు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కొత్తచెరువు అమ్మ ఆలయంలో అర్చకులు రాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గౌరీ నోములు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని వడ్డెర్ల ఘట్టాన్ని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. మంగళవారం జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పెద్దన్న తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కదిరి టౌన్ : 1973-74లో కదిరి బాలుర ఉన్నత పాఠశాల (డి.సెక్షన్)లో చదివిన విద్యార్థులు సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. 2024-ఫిబ్రవరిలో అప్పటి గురువులను సన్మానించి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో హాజీ అత్తార్ మహబూబ్ బాషా, టి.రామలింగయ్య, బాషా, మండి రజియుల్లా, టి.శ్రీనివాసులు (సత్రం శీన), వీరనారాయణ, నాగేంద్ర, అల్లాబకాష్, జనార్ధనరెడ్డి, అజ్మతుల్లాఖాన్, భాస్కరరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నారాయణ స్వామి, రాధాకృష్ణ, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. మిత్రులు కదిరి అత్తార్ మహబూబ్ బాషా 99664 59569 నంబరుకు సంప్రదించాలని కోరారు.

రోడ్డుపైన తాబేళ్లు

రొద్దం : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బావులు, చెరువుల్లో నీరు లేక జలచరాలు, అడవి జంతువులు రోడ్లపైకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి రొద్దంలోని మారెమ్మ గుడి వద్ద పంట పొలాల్లో నుంచి పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపైకి తాబేళ్లు రావడం కనిపించింది.

తారురోడ్డుపైకి వచ్చిన తాబేలు

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేల చొప్పు పరిహారం చెల్లించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని గుంజేపల్లి గ్రామంలో పర్యటించి రైతు మంత్రి నడిపి ఓబులేసు పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి తిప్పయ్య, రైతు సంఘం నాయకులు డాబా కృష్ణ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన అన్ని పంటలు దెబ్బతిన్నాయ న్నారు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతిపెద్ద మండలమైన ముదిగుబ్బలో 80 శాతం మంది వేరుశనగ పంట జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభు త్వం ఎకరాకు రూ. 50 వేలు పరిహారం, వంద శాతం బీమా అందజేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుంజేపల్లి కృష్ణయ్య, ఆదెప్ప, శంకర, గోనుగుంట్ల అమర్‌నాథ్, లింగప్ప, చెవిటి వెంగమనాయుడు, వెంకటేశ్వరనాయక్, ఎఐఎస్ఎఫ్ మండల నాయకులు దేవేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు

నష్టపోయిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు